# అభిరుచి

ముప్ఫై ఏళ్లు చేరువవుతుంటేనే... పిత్రార్జితమైన కోట్లాది ఆస్తిని పెంచి పోషించాల్సిన బాధ్యత చేపట్టాడు రవికాంత్.

యు.కె.లో ఎంబిఏ పూర్తి చేసి తిరిగివస్తూ ఓ నెల్లాళ్లు చుట్టుపక్కల దేశాల అందాలు చూసొస్తానని తండ్రిని రిక్వెస్ట్ చేశాడు. తండ్రి "సరే ఎంజాయ్ చేయి" అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

రవికాంత్ విదేశ విహారంలో ఉండగా తండ్రికి హార్ట్ ఎటాక్... అర్జెంటుగా ఇంటికి రమ్మని పిలుపందింది.

ఆఘమేఘాల మీద ఇంటికి చేరి- హాస్పిటల్ కెళ్లాడు. హైదరాబాద్‌లో వాళ్ల కంపెనీల్లో పని చేస్తున్న వందలాది మంది జనం హాస్పిటల్ ముందు గుమిగూడి ఉన్నారు. అందరి మొహంలోని ఆందోళనలో తన తండ్రి మీద ఉన్న కృతజ్ఞతాభావం కనిపిస్తోంది. ఆ హాస్పిటల్ కూడా రవికాంత్ తండ్రి నడుపుతున్నదే.

కొంతమంది పెద్ద ఉద్యోగస్తులూ, స్టాఫ్ డాక్టర్లూ కూడా రవికాంత్‌ని రిసీవ్ చేసుకున్నారు.

ఐసీయూలో ఉన్న తండ్రిని రవికాంత్ చూశాడు.

తండ్రి రవికాంత్‌ని కళ్లతో ఆశీర్వదించి, తృప్తిగా కళ్లు మూసుకున్నాడు.

ఆ తర్వాత- అడ్వొకేట్లూ... వీలునామా... హక్కులూ... బాధ్యతలూ... క్లైములూ కేస్‌లూ డీల్సూ అన్నిటిలోనూ బిజీ అయిపోతున్నాడు రవికాంత్.

ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు బెంగుళూరు, మద్రాసులాంటి మహానగరాల్లోనూ రవికాంత్ తండ్రి వ్యాపారాలు విస్తరింప జేశాడు. రియల్ ఎస్టేట్ నుంచి, పేపరు, కాటన్ మిల్లులూ, కార్పొరేట్ ప్రైవేట్ కాలేజీలు, కార్పొరేట్ హాస్పిటల్స్ అన్నీ ఆయన స్వార్జితం. ప్రతీ సంస్థకీ నమ్మకస్తుల్ని మేనేజర్లుగా పెట్టి ఆయన చైర్మన్‌గా ఉండేవాడు. ఆ సంస్థలన్నిటికీ మకుటం పెట్టిన కొత్త చైర్మన్ రవికాంత్.

రవికాంత్ సర్వసమర్థుడన్న నమ్మకంతో, మంచి వాడన్న ధీమాతో తండ్రి నిశ్చింతగా గుండె ఆపేసుకున్నాడు.

రవికాంత్ తను నిర్వహించవలసిన ప్రతీ సంస్థకీ ఒక పి.ఏని అపాయింట్ చేసుకున్నాడు. ఓవరాల్‌గా తనకో పర్సనల్ మేనేజర్- ఇలా ఏర్పాటు చేసుకున్నాక- సెంట్రల్ ఆఫీసు నుంచి టెలీకాన్ఫరెన్సులతో, ఇంటర్నెట్ సర్వీసుల్తో చైర్మన్‌గా తన చదువునీ, చురుకుతనాన్నీ, సాంకేతిక పరిజ్ఞానాన్నీ వినియోగిస్తూ మంచి పేరే పొందుతున్నాడు.

ఏ కంపెనీలో కాన్ఫరెన్స్‌కెళ్లినా అందరితోబాటు ఫైవ్ స్టార్ భోజనం చేయటం అతనికి మొహమ్మొత్తుతోంది.

ఈ సూట్‌లూ కోట్లూ టైలూ బూట్లూ ఏసీ రూములూ అన్నీ అతనికి రొటీన్ అనిపించి బోరుకొడుతోంది. కానీ ఓ పదవికి ఓ వేషం

ఉండాలి! డ్రైవరూ-ఆఫీసుబాయ్ కూడా... ఇలా రొటీన్ డ్రెస్‌లు చిరాకని యూనిఫాం మానేస్తే... బాగోదు అనే ఇంగితంతో సర్దుకుపోతున్నాడు.

ఒక రకంగా వాళ్లు అదృష్టవంతులు. షిఫ్టు అవగానే ఇంటికెళ్తారు. వెచ్చగా స్నానం చేసి ప్రేమగా భార్య వడ్డించే పచ్చడి మెతుకులైనా ఎంత రుచితో ఆనందంగా తింటారు... అనిపిస్తుంది అప్పుడప్పుడు.

✦ ✦ ✦

బెంగుళూరు వెళ్లటానికి కారు బైల్దేరింది.

పక్కా రోడ్‌లో ఏదో పొలిటికల్ పార్టీ మీటింగ్ కోసం రద్దీగా వాహనాలూ కార్యకర్తలూ వెళ్తున్నారు. "వాళ్ల వెనకాలే పెళ్లి ఊరేగింపులా వెళ్తే ఎప్పటికి వెళ్తామో... ఒక సైడ్ రోడ్ తీసుకో" మని మేనేజరు సలహా. పి.ఏ. ఆమోదించాడు. ఛైర్మన్ 'సరే' అన్నాడు.

డ్రైవర్ ప్రకాశ్ దారి మళ్లించాడు.

వెనక సీట్లో ఛైర్మన్‌గారూ- మేనేజరుగారూ కూర్చున్నారు.

ముందు సీట్లో పి.ఏ. ఉన్నాడు.

"ఈ రోడ్ మరీ వరస్ట్‌గా ఉంది" పి.ఏ. సలహా చెప్పిన మేనేజర్ మనస్సు చివుక్కుమనేట్లు అన్నాడు.

పోను పోనూ రోడ్డు మీద రిస్కీడ్రైవ్ చేయవల్సొస్తోంది. డ్రైవర్ ప్రకాశ్-

మధ్యలో 5-10 అడుగుల మేర నిలవ వాననీరు-

"ఏ నీటికింద ఏ రాళ్లున్నాయో జాగ్రత్త" అంటున్నాడు పి.ఏ. ఒక్కోసారి, కారాపి ప్రకాశ్ ఆ నీటిలో నడుస్తూ చూస్తున్నాడు.

"మడమ లోతుకన్నా ఎక్కువ లేదులెండి" అంటూ కారు స్టార్ట్ చేస్తున్నాడు.

ఒకచోట 'టక్'మని కుదుపుతో కారాగింది. కారు వెనక చక్రం ఒక 'గంత'లో పడింది. ఏ గేర్లోనూ టైరు బైటకి రాలేదు.

"నెట్టాలా" పి.ఏ. అడగటంలో ఎన్ని వంకర్లున్నాయో... ప్రకాశ్‌కీ మేనేజర్‌కీ తెల్సు- చైర్మన్‌కి చిరాకు కలగలేదు.

"కాస్సేపు కొత్త పని... వెరైటీగా ఉంటుంది. దిగండి మేనేజర్ గారూ" అంటూ చైర్మన్ దిగాడు.

"సార్ సార్ మీరొద్దు సార్... మీరు కూచోండి" అన్నాడు పి.ఏ.

"సర్లేవయ్యా- కాస్తసేపు ఆకాశం కింద నిలబడి- నేచురల్ గాలి పీల్చుకుని పాదయాత్ర చేద్దాం"

ప్రకాశ్ మొహమాటంగా "సార్... స్టీరింగ్ దగ్గరుంటే.."

"అవసరం లేదన్నానా?" చైర్మన్ మందలింపుగా అన్నాడు.

ముగ్గురు వెనక్కి వచ్చారు శ్రమదానానికి సిద్ధపడి.

"ఇక్కడేదో... ఆయిల్ లీకేజి... వీడి కేరేజీ పడి ఉంటుంది" కనిపెట్టి చెప్పాడు పి.ఏ.

"ఛీ... వెధవ కంపు- ఇంగువో, వెల్లుల్లిపాయో" చిరాకు పడుతూ మేనేజర్ అన్నాడు. "ఏయ్ ప్రకాశ్... ముందు ఇది క్లీన్ చేయ్" గర్జించాడు.

"సారీ సార్...! వన్ సెకన్" గట్టిగా అరచినందుకో, వెయిట్ చేయించినందుకో అసలీ రోడ్డు మీదకి తను డైవర్ట్ చేయించినందుకో... తెలిసీ తెలియకుండా మేనేజర్ నసిగాడు.

ఛైర్మన్ ఇవేం పట్టించుకోవట్లేదు. కమ్మటి ఇంగువ పరిమళం చూస్తుంటే అమ్మ గుర్తొస్తోంది.

తను బాంబే హాస్టల్‌లో వుండి చదువుతున్నప్పుడు, ఢిల్లీలో పీజీ చేస్తున్నప్పుడు, ఆఖరికి విదేశాలకి వెళ్తున్నప్పుడు- అమ్మ గోంగూర వెల్లుల్లి పచ్చడీ, మాగాయీ ఇంగువ వేసి... సీసాలూ, డబ్బాలూ నింపి ఇచ్చేది-

ఇదే పరిమళం-

ఇదే వాసన-

అమ్మ పోయాక- ఇంతటి కమ్మటి వాసనలు ఎక్కువగా తన నోరుని ఊరించలేదనే చెప్పాలి.

ఛైర్మన్‌లోంచి... రవికాంత్‌ని గత జ్ఞాపకాలకి తీసుకెళ్లింది ఆ క్షణం.

"మీ(రండి... లోపల కూచుందాం. వీడి క్లీనింగ్ అయ్యేప్పటికి పది నిమిషాలు పడుతుంది''

ఇంకాస్సేపు అక్కడ నించోవాలనే అనిపించింది.

'తనొక్కడూ ఈ జర్నీలో ఉండి ఉంటే ఖచ్చితంగా ఆ కేరేజీ తను లాక్కునో డిమాండ్ చేసో ఖాళీ చేసుండేవాడు' తన ఊహ తనకే నవ్వొచ్చింది.

తన హోదా అంతస్థూ డబ్బూ దస్కం ఒక్కోసారి ఇష్టాలకి ఎన్ని ప్రతిబంధకాలో-

కార్లోకి నడిచారు ముగ్గురూ.

ప్రకాశ్ కేరేజీ మూత సర్దేసి... ఈ సార్లు కారు తోయడానికి వీలుగా 'లీక్' అయిన పచ్చడి ఊటని తుడుస్తున్నాడు.

లోపల కార్లో- కాన్ఫరెన్స్‌లో ఆర్డర్ చేస్తున్న డిన్నర్ అయిటమ్స్ మెనూ చెప్తున్నాడు మేనేజర్-

'షరా మామూలే' అనుకున్నాడు చైర్మన్.

"ఓకే... ఓకే... మీకిష్టమైనవన్నీ చెప్పండి. ఇవన్నీ నాతో చెప్పక్కర్లేదు" అన్నాడు అక్కసు కన్పడనీయకుండా.

కొంత సేపటికి ప్రకాశ్ వచ్చాడు. ఆరు చేతులు కారు ఇంజన్‌కు బలంగా సాయపడ్డాయి- కారు కదిలింది.

'ఇంకా పరిమళం ఉంది' అనుకున్నాడు చైర్మన్.

"కంపు పోలేదు బాగా కడుగు" ప్రకాష్‌ని రెచ్చిపోతూ హెచ్చరించాడు మేనేజర్.

✦ ✦ ✦

మధ్య ఊళ్లలో ఉన్న కల్టివేటెడ్ ఫామ్స్ చూసుకున్నాక మరో ఆరు గంటలకి బెంగుళూరు హోటల్ రూమ్ ముందు కారాగింది.

బుక్ చేసిన రూమ్ చూసి రావటానికి...

మేనేజరూ పి.ఏ. పరిగెట్టారు-

ఆ గేప్‌లో... రవికాంత్ "ఇందాకటి పచ్చడీ..." అంటూ... మొదలెట్టాడు తనకి తెచ్చిపెట్టమని అడుగుదామని... నసుగుతుండగా-

"మన సూట్ రడీ సార్..." అంటూ ఇద్దరు ఛీఫ్‌లూ వచ్చేశారు.

ప్రకాశ్‌కేసి... చూసి... విరక్తిగా వెళ్లిపోయాడు చైర్మన్ రవికాంత్.